క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లి ప్రాథమిక పాఠశాలకు గురువారం ఎంపీటీసీ బూరం మల్లేష్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మల్లేష్‌ను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కేశమెని లింగమ్మ, పాఠశాల హెచ్‌ఎం జంగయ్య, మాజీ సర్పంచ్ లింగమయ్య, ఉపాధ్యాయులు రాము, మాజీ ఉప సర్పంచు పూర్యానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల పాఠశాలలో గురువారం రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను సిబ్బంది విద్యార్థులకు పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరు మాత్రలు వేసుకోవాలని కోరారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహిస్తునట్లు వైద్యులు తెలిపారు.

'గృహజ్యోతి'కి 183 దరఖాస్తులు

కల్వకుర్తిరూరల్: ఆరు గ్యారంటీ పథకాల కోసం గతంలో ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా జీరో బిల్లు రానివారు అధికారులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. కల్వకుర్తి విద్యుత్ ఏఈ పరిధిలో 18 వేలమంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో 6 వేల మంది వినియోగదారుల మాత్రమే గృహజ్యోతి పథకం అమలు అయ్యింది. పలు గ్రామాలకు చెందిన 183 మంది మాత్రమే గురువారం వరకు గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ వెంకట్‌రాములు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు

కొల్లాపూర్: పట్టణ మాజీ సర్పంచ్ 21వ వర్ధంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. ఆయన సమాధి వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజనుల సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషి చేశారని పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవి గౌతంగౌడ్, నాయకులు బాలు, చిలక వెంకటస్వామిగౌడ్, వెంకటేశ్వర్లు, బాలెమియా, హోటల్ మహేష్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని రాచూర్, కుప్పగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ నెల 28న ఉదయం 10:00 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కల్వకుర్తి ఏడీఏ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని 132 కేవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు పనులు చేపడుతునట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

కొల్లాపూర్: పట్టణంలోని చుక్కాయిపల్లి కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శీలం వెంకటేష్ బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం మోటార్‌సైకిల్‌పై సోమశిలకు వెళ్తుండగా గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో చెవిలో నుంచి రక్తం వచ్చింది. స్థానికులు గమనించి కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

నడిగడ్డ బస్సును పునరుద్ధరించాలి

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ నుంచి తెలకపల్లి మండలంలోని కార్వంగ మీదుగా తాళ్లపల్లి, నడిగడ్డ వరకు బస్సు సౌకర్యం ఉండేదని విద్యార్థులు పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం రెండుసార్లు బస్సు సౌకర్యం ఉండేదని కొంత కాలంగా బస్సును రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాళ్లపల్లి, నడిగడ్డ నుంచి కార్వంగ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులు బస్సులేకపోవడంతో కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంతో బురదరోడ్లపై వెళ్లలేమని పాఠ్య పుస్తకాలు తడిచిపోతాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును యథావిధిగా పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల కోరుతున్నారు.

చదువుతోనే ఉజ్వల్ భవిష్యత్



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: చదువుతోనే ఉజ్వల్ భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుమ్మెరలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాగా చదువుకున్న వారికి సమాజంలో గౌరవం ఉంటుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మేఘ కంపెనీ మేనేజర్ పార్థసారధి, కొండనాగేష్, రోహిణి, గోవర్ధన్, లక్ష్మన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

తాడూరు: మండలంలోని శిర్సవాడలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాలను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం పాఠశాలలో కొత్త సంస్కరణలను తీసుకొస్తుందన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి పాఠశాల కాంపౌండు నిర్మాణానికి రూ.60 లక్షల ప్రభుత్వ బిల్లులు మంజూరు చేయించుకొని సొంతంగా ట్రస్ట్ ద్వార నిర్మించానని ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణిగోవర్ధన్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, పాఠశాల జీహెచ్‌ఎం రమేష్, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి, బలాన్‌పల్లి జీహెచ్‌ఎం పరమేష్‌ప్రసాద్, కుమ్మెర ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెంచు మహిళపై దాడి దుర్మార్గం



మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ

మన్ననూర్: చెంచు మహిళపై దాడికి పాల్పడడం దుర్మార్గం అని కుల నిర్మూలన పోరాట సమితి నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ అన్నారు. చెంచు మహిళ కాట్రాజు ఈశ్వరమ్మకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 15 రోజుల కిందట కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో ఈశ్వరమ్మపై అమానుషంగా దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఇప్పటి వరకు కూడా అరెస్టు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం, పక్కా ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 30న ఉదయం 10:30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివాసి సంఘం, దళిత, ప్రజా, మహిళా, విద్యార్థి, ఉపాధ్యాయ, మేధావి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అంబయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల అమ్మకంపై డీటీడీఓకు ఫిర్యాదు



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

అచ్చంపేట్ రూరల్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలను స్క్రాప్ దుకాణానికి సిబ్బంది విక్రయించారని గురువారం విద్యార్థి సంఘాల నాయకులు డీటీడీఓ కమలాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహించే ఇద్దరు వర్కర్లు అమ్మారని వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆశ్రమ, సంక్షేమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలపై పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. పుస్తకాల అమ్మకం సంఘటకు సంబంధించి ఆశ్రమ పాఠశాల గోదాం ఇన్‌చార్జ్ తిరుపతయ్యకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు డీటీడీఓ తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పాఠ్య పుస్తకాలను పాత సామానుల దుకాణంలో అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అచ్చంపేట ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మణ్, శివ, సునీల్, ఆంజనేయులు, అభిరాం పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానం

చారకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ప్రమోషన్లపై ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. బదిలీ అయిన హెచ్‌ఎం శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు అంజయ్య, రజిత, సుందర్, సరితలను పాఠశాల హెచ్‌ఎం భగవాన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువ, పూలమాలతో సన్మానించారు. అదేవిధంగా పాఠశాలకు నూతనంగా బాధ్యతలు తీసుకున్న హెచ్‌ఎం భగవాన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న రైతులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. గురువారం ఖాతాదారులు మేనేజర్‌కు ఘనంగా సన్మానించారు. మేనేజర్‌గా పేదలకు సేవలు అందించారని రైతులు కొనియాడారు. ఆయన సేవలను మండల ప్రజలు మరిచిపోరన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఉదయ్‌కుమార్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: మండలంలోని చిన్నకొత్తపల్లిలో ఇటీవల మాజీ సర్పంచ్ తల్లి మల్లమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న కౌండిన్య దళం మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భరత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు ప్రసాద్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, సత్యంగౌడ్, లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

భాషాపండితుల అప్‌గ్రేడేషన్‌పై హర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పీఈటీలను, భాషా పండితులను అప్‌గ్రెడేషన్ చేయడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. డీఈఓ గోవిందరాజులు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో కలిసి ఆర్డర్ కాపీలను పంపిణీ చేశారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు పీఈ విజయ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వెల్దండ: మండల కేంద్రంలోని బాలుర బీసీ వసతి గృహంలో విద్యార్థులు చేరేందుకు ఈనెల చివరి వరకు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరి బోనాఫైడ్ పొంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు తప్పనిసరిని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు



తహసీల్దార్ కార్యాలయం భవనం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత 40 సంవత్సరాలు తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి తహసీల్దార్ భవన నిర్మాణం కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పాత పోలీసుస్టేషన్ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. మరో రెండు నెలల్లో కొత్త భవనంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

మంత్రి పదవులను బీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: త్వరలో విస్తరించనున్న మంత్రి పదవులలో హోంశాఖ, విద్యాశాఖ మంత్రి పదవులను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణాయాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్లనిరంజన్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో హోంశాఖ, విద్యాశాఖ మంత్రులు లేకపోవడంతో ఆశాఖ పరిధిలో పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. వార్షిక బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను అదనంగా కేటాయిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కామారెడ్డి బహిరంగ సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాపగల్‌లో లోపించిన పారిశుద్ధ్యం



గుడి దగ్గర పేరుకుపోయిన చెత్తాచెదారం

తాడూరు: మండలంలోని పాపగల్‌లో పారిశుద్ధ్యంలోపంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో మురుగుకాల్వలు శుభ్రం చేయించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9వ వార్డులోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మురుగునీరు ఒకేచోట నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు ఆవాసాలు ఏర్పర్చుకున్నాయని దీంతో వార్డు ప్రజలు రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని శ్రీపురం శివారులో గురువారం విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలయ్యకు సంబంధించిన గోర్లు గ్రామ శివారులో గడ్డి మేస్తున్నాయి. సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు తగలడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల విలువ దాదాపు రూ.15 వేలకు పైగా ఉంటుందని బాధితుడు వివరించారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి, బొల్లారం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులను తీసి వారి ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు.



మెడికల్ కళాశాలకు బస్సు వితరణ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి సతీమణి కూచుకుళ్ల సౌభాగ్యమ్మ పేరుపై గురువారం మెడికల్ కళాశాలకు బస్సును వితరణ చేశారు. ఈ మేరకు గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి డాక్టర్ రాజేష్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. మెడికల్ కాలేజ్ విద్యార్థుల సౌకర్యార్థం కోసం బస్సును అందజేసినట్లు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

వెల్దండ: అభివృద్ధిలో అందరం భాగస్వాములవుదామని ఎంపీపీ విజయ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసికట్టుగా పని చేయాలని కోరారు. మండలానికి 20 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో కొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని మిగతా గ్రామాల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్యా, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. అంతుకు ముందు అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు.

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

మండల సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు ఎంపీటీసీలకు అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీను, ఎంపీఓ సునీత, ఏఓ మంజుల, అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్రీమతి, ఏపీఎం రాములు, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, డాక్టర్ శ్యామ్‌సుందర్, ఏఈ మహేందర్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఎంపీటీసీలు మోతిలాల్‌నాయక్, గుత్తి వెంకటయ్య యాదవ్, చక్రవర్తిగౌడు, జ్యోతి, లక్ష్మమ్మ, చిట్టి, రాములు, వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుఉన్నారు.

జీహెచ్‌ఎంకు వీడ్కోలు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందనున్న జీహెచ్‌ఎం వేదావతికి గురువారం పాఠశాలలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, జీహెచ్‌ఎంలు హన్మంత్‌రెడ్డి, లక్ష్మారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైమాక్స్ లైట్లు ప్రారంభం

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో ఏర్పాటుచేసిన మూడు హైమాక్స్ లైట్లను గురువారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీటీసీ అనురాధ రఘుపతిరెడ్డి అన్నారు. నాయకులు వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

'నీట్' పేపర్ లీక్ నిందితులను శిక్షించాలి

అచ్చంపేట: పేపర్ లీక్‌కు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి నిందితులను శిక్షించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో అచ్చంపేట యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, లీగల్ సెల్ చైర్మన్ చత్రునాయక్, రాష్ట్ర కార్యదర్శి కుంద మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు రాము, శ్రీనివాస్‌రాథోడ్, మల్లయ్య, నర్సింహ్మానాయక్, జాన్‌పాల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందుతున్న యువతులు

కొల్లాపూర్: నిరుద్యోగులు శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రత్నగిరి ఫౌండేషన్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్‌రావు, కన్వీనర్ కేతూరి ధర్మతేజలు అన్నారు. నియోజకవర్గానికి చెందిన యువతులు హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో గల అకుషాపూర్‌లో డ్రోన్ పైలెట్ శిక్షణ పొందుతున్నారు. రత్నగిరి ఫౌండేషన్ ద్వారా తారా యూఏవీ ప్రైవేట్ లిమిటెడ్ వారు నియోజకవర్గానికి చెందిన 30 మంది యువతులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వారు శిక్షణా కేంద్రాన్ని వారు సందర్శించారు. యువతులకు కల్పిస్తున్న వసతీ, సౌకర్యాలను పరిశీలించారు. శిక్షణ పూర్తిచేసుకున్న యువతులకు ప్రభుత్వ సహకారంతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడతామని వారు పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా



గ్రామ శివారులో ఇసుకను నిల్వ ఉంచిన దృశ్యం



నిల్వ చేసిన ఇసుక డంప్

తాడూరు: దుందుంబీనది తీరాన ఉన్న మండలంలోని గోవిందాయిపల్లిలో అడ్డు అదుపు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేల ట్రాక్టర్ల ద్వార దుందుబీనదిలోకి వెళ్లి ఇసుకను తరలించడంతోపాటు ఆయా ప్రదేశాల వద్ద ఇసుక డంపులను ఏర్పాటు చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. రాత్రివేళలో ట్రాక్టర్ల శబ్దాలకు పిల్లలు నిద్రించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంతోపాటు ఇసుకను నిల్వ ఉంచుకున్న ప్రదేశాలను పరిశీలించి గ్రామానికి ఉపయోగపడేవిధంగా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

మరుగుదొడ్లకు మరమ్మతు చేయాలి



మండలంలోని తోటపల్లి పాఠశాలలో దెబ్బతిన్న మరుగుదొడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్కావెంజర్స్ ఉండేవారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ సిబ్బంది మరుగుదొడ్ల బాధ్యత చూడాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికి చాలా పాఠశాలలో ఆయా గ్రామ పంచాయతీలు పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. మరికొన్ని పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షేమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

నాగర్ కర్నూల్: సంక్షేమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీయూడబ్ల్యూజే–హెచ్ 143 జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆయన చాంబర్‌లో కలిసి కలెక్టర్‌కు పూలబొకే ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధిలో కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే–హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్, ఐజేయూ జాతీయ నాయకుడు జెమిని సురేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, శేఖరాచారి, అహ్మదుల్లా ఖాన్, రామ్ లక్ష్మణ్, మహమ్మద్ సాజిద్, కపిలవాయి రాజు, గోవిందు బాలస్వామి, సత్యం తదితరులు పాల్గొన్నారు.